# ప్రేమఫలము

భమిడిపాటి చినయజ్ఞనారాయణ శర్మగారు

అది విశాలమైన కొండవాగు. తన కళాపాండిత్యము చూపించి ఏ మహానుభావుడూ దానిని నిర్మించి ఉండలేదు సరే కదా, దానికి వన్నెలు పెట్టడానికికూడా ప్రయత్నముచేసి ఉండలేదు. తరుచుగా మనుష్యులు వెళ్లడానికి అవకాశములేని కొండ ఇరుకులలో ఆవాగు ఉంది. ఆ కారణముచేత నవీన సంస్కారాలేమీ దానిని ఎంగిలి చేయలేదు, అమృతోపమానమైన చక్కని నీళ్లతో ఎప్పుడూ అది నిండి ఉంటుంది. ఆ నీళ్లు చాలా తేలిక, నిర్మలమైనవి. కాసారంకూడా చాలా లోతుకలది. బండరాళ్లమీదనుండీ, చిన్న గులకరాళ్ల మీదనుండీ, గలగల ధ్వనులు చేసుకుంటూ ప్రవహిస్తూ ఉంటాయి ఆ చెరువులోకి మంచినీళ్ల ఊటలు. ఆగ్నేయమూలగా ఉన్న ఒక చిన్నకాలువనుంచి ఎక్కువైన నీరు పొర్లి పారుతూ ఉంటుంది ఒక కోనలోకి.

౨

పెద్ద చాపరాళ్లు, పళ్లచెట్లు, చెరువు చుట్టూ అక్కడక్కడ ఉన్నాయి అందంగా. రకరకాలపిట్టలు ఆ చెట్లమీద తమ నివాసాలు కట్టుకుని, హాయిగా నివసిస్తూ ఉన్నాయి. ఎండవేళప్పుడు ఆ కొండలమీద ఉన్న వన్యమృగాలు దాహోపశాంతికోసం ఆ జలాశయానికి వచ్చి డప్పి తీర్చుకుని, చెట్లనీడని పిట్టలపాటలు వింటూ అరమోడ్పుకళ్లతో విశ్రాంతి తీసుకుంటాయి. గాలికుర్రాడు చెరువునీళ్లతోనూ, అందులో ఉన్న పద్మాలతోనూ, ఒడ్డున పొడుగాటి పచ్చికతోనూ నిత్యము ఆడుకుంటూ ఉంటాడు. వసంతకాలంనాటి ఆదృశ్యం తనివి తీరా చూడవలసిందే! చూచి అనుభవించవలసిందే!

౩

కొన్ని వికసించినవీ, కొన్ని వికసించనివీ, కొన్ని అప్పుడప్పుడే విచ్చుతూ ఉన్నవీ పద్మాలు. ఆ సాయంకాలపు ఎండకాంతులలో, తమ కాంతులు లీనంచేసి, జలాశయాన్నంతా వెలిగించి వేస్తున్నాయి. పిల్లగాలి గిలిగింతలికి ఇటూ అటూ ఒరిగిపోతూ, సిగ్గు ప్రకటిస్తున్నాయి ఆ కన్నెతామరలు. ప్రకృతిశృంగారమంతా అక్కడ మూర్తీభవించిపోయింది.

౪

సాయంకాలపు చల్లగాలిలో విహరించి వత్తామని, ఒయ్యారపుగీతాలు పాడుకుంటూ మిలమిలా మెరసిపోతూ బయలుదేరాడు ఆ అడవిలోనుంచి ఒక తేటికుర్రాడు. దారిలో కన్నెఉమ్మెత్తలు, సన్నజాజులు, మాలతులు, కొండమల్లెలు, బండిగురివెందలు, ఎన్నో లేతపువ్వులు, వలపువాసనలు కురిపిస్తూ భృంగకుమారునికి స్వాగతమిచ్చాయి; ఆహ్వానించాయి. స్వాగతమంగీకరించాడు; ఆహ్వానం మన్నించాడు. ఆ పుష్పాలలో తనకు కావలసిన మధువు ఏమీ చిక్కలేదు. తుదకు నిస్సారమనిపించింది.

౫

భావగీతాలు పాడుకుంటూ, ఆ మనోహర కాసారపరిసరాలకు వచ్చాడు తేటి బొట్టెడు. ఈలాటి దృశ్యం ఎన్నడూ అతను చూచి ఉండకపోవడముచేత ఒక్కసారిగా ముగ్ధుడయిపోయాడు. ఆ చెరువునడుమ ఆడుకుంటూ, తేలిపోతూ ఉన్న పద్మాలని చూసి, వాటితో ఆడుకోడానికి అక్కడకు వెళ్లాడు. బొగడలనడుమ అప్పుడే వికసిస్తూ ఉన్న ఒక పద్మము అతనిని ఆకర్షించింది. ప్రణయగీతాలు పాడుకుంటూ, ఆమె చుట్టూ ప్రదక్షిణం చేయడం ప్రారంభించాడు. అన్యజాతి పురుగునుకూడా గీతామాధుర్యంచేత తన జాతిలోకి మార్చుకోగలిగిన శక్తి సామర్థ్యంగల భృంగరాజు ఈ కోమలకుసుమాన్ని ఏమి చెయ్యలేదు! ఆ ప్రణయగీతాలతో కాసారాన్నంతా ముంచివేశాడు. ఆ కొండకోనంతా ప్రణయమయిపోయింది. అక్కడి గాలి, పిట్టలు, చెరువునీరు, వృక్షాలు అన్నీకూడా ఆ ప్రణయమూర్తి పాడుతూఉన్న ప్రేమపల్లవిని అందిపుచ్చుకుని, కొత్త కళలతో పాడుతున్నాయి. ఆ సంగీతంలో ఏకీభవించి పోతున్నాయి.

౬

ప్రణయమధువు పూర్తిగా క్రోలడముచేత పద్మిని తన్మయమై అచేతనురాలయిపోయింది. తానుకూడా ఒక ప్రణయమూర్తిగా మారిపోయి, ఆయాసంగా, కొసకొస గంటిచూపుతో ప్రణయగీతి ఆలాపిస్తూ ఉన్న తుమ్మెద బిడ్డడికేసి చూసింది. అదే సమయానికి అతడుకూడా పద్మినిని చూచాడు. ఒకరి చూపులోనుంచి రెండోవారి చూపు దూసుకుపోయి హృదయాల్లోకి చొచ్చింది. దానితో ఒకరి హృదయం ఒకరికి తెలిసిపోయింది. తేటికుమారుడు ఒయ్యారంగా పద్మిని కరం గ్రహించబోయాడు. పద్మిని శరీరం గగుర్పొడిచి రెక్కలు కదిలాయి. * * * *
పద్మిని తన మృదుకరాల్తో తేటికుమారుణ్ని కౌగలించుకుంది. ఆరాత్రి పద్మిని ఇంటనే ఉండిపోయాడు తేటిబొట్టెడు.

౭

పరిశుభ్రత లేకపోవడానికి, మోటుతనానికి పేరుపడ్డది దున్నపోతుజాతి. వాటి గోల తక్క వెనుకనుంచి తమమీాదికి దూకివచ్చేవాటినికూడా అవి గమనించవు. "ఇనపసరుకు" అని ముద్దుపేరు పెట్టింది ప్రపంచకం ఆ జాతికంతా! అందుకే కారు దున్నపోతుల సంగతి ఆలోచించుకోవలసినదే. క్రౌర్యంకూడా వాటికి ఎక్కువ... ......అది నూనవయస్సులో ఉన్న అడవి దున్న. ఆకలిబాధ ఎక్కువగా ఉన్నా ఎండకి జడిసి ఆలాగే ఒక చెట్టునీడను పడి ఉంది. మేతలేకపోవడానికి తోడు, ఆ మొండగాడుపులకి నాలిక తడి ఆర్చుకుపోయింది. పిపాస తీర్చుకోవడానికైనా కదలలేదు. ఆలాగే ఎండంత కాలము చెట్టునీడను ఉంది. సాయంకాలము నాలుగు గంటల తరవాత బయలువెడలి తిన్నగా ఈకాసారం చేరుకుంది. నీటితో తొడుకుతూ ఉన్న ఆకాసారంలోకి వికారంగా రంకెలు వేసు

కుంటూ ఒక్కసారిగా ఉరికింది. ఓ! దాని స్వేచ్ఛ: ఆవాగంతా అల్లకల్లోలంచేసి, నానా భీభత్సంచేసింది. దాని హడావిడికి, నీటిపైని మనోహరంగా తేలి ఆడుకుంటున్న జలవిహంగాలు ఎగిరిపోయాయి. జలచరాలు బొరియలలో దూరిపోయాయి. ఆ దున్న తిన్నగా పద్మవనములో ప్రవేశించి, చిత్తానుసారంగా కలచివెయ్యడము ప్రారంభించింది. ఆ విహారవిలాసాల్లో, తామరతూండ్లన్నీ చికిబికిగా తెగిపోయాయి. పువ్వులు, మొగ్గలు, ఆకులు, నలిగిపోయి, చినిగిపోయి చిందరవందర అయిపోయాయి. ఆ సరోవరమంతా కలిగి పంకిలమయిపోయింది. రంభారావణ చరిత్రాన్ని తలపింపచేస్తూంది ఆ సరస్సు దృశ్యం. మహిషమూర్తి తన లీల చాలించి అడవిలోకి తిరుగా వెళ్ళిపోయాడు.

౯

ఈ దృశ్యము చూడడముచేత, సూర్యభగవానుడు తన కోపారుణిత నేత్రాలతో సాయంసంధ్యాకిరణాలు కురిపిస్తున్నాడు. అల్లకల్లోలమయి భీభత్సపురూపు తాల్చిన కోనేరు ఇంకా తేరుకోలేదు. పెళ్లికొడుకులాగు ముస్తాబై, మునపటికంటె ఎక్కువ ప్రణయం కురిపిస్తూ, ఎప్పటిమల్లే వచ్చాడు ఆ తుమ్మెదకుర్రాడు పాటపాడుకుంటూను. మామూలు చోటికి వెళ్లిచూస్తే అక్కడి తామరవనమంతా చిందరవందరగా ఉంది. ఒక్క పువ్వు, ఒక్క మొగ్గ, ఒక్క ఆకు కూడా చినిగిపోకుండా ఉండలేదు. ♦ ♦

౬

తెల్లవారింది. కర్మసాక్షి నవ్వుకుంటూ తూరుపుకొండమీదికి వచ్చాడు. ఆవాగులో నీళ్లు కొంచెము తేరిఉన్నాయి. ఒకమూల చినిగిపోయి, కొన్ని రేకులు రాలిపోయిన పద్మము ఆ నీటిమీద తేలి జాలిగా ఉంది. ఆ చెంగటనే తుమ్మెదకుమారుని భౌతికశరీరం ఆ రేకులతో ఆడుకుంటూంది.

౧౦

పద్మం చితికిపోయినా, తుమ్మెద చచ్చిపోయినా ప్రకృతిమాత్రం మార్పులేకుండా నడుస్తూవుంది. —ప్రభావతిజ్ఞప్తి.

# తెలుఁగునాడు

కర్లపాలెం కృష్ణరావుగారు

తెలుఁగునాడును గొల్వరా! తమ్ముడా! తెలుగుగాలిని బీల్చరా!
తెలివిగలవాళ్లంత—తెలుఁగువారేనోయి! తమ్ముడా!
తెలుఁగు మాటలునేర్చి, తెలుఁగు పంటల మెక్కి,
తెలుఁగు భూముల నిక్కి, ధీరత్వమునుజూప, తమ్ముడా! దేశ-
దేశాల కెక్కరా! తమ్ముడా!.........॥ తెలుగు—॥
దివ్యతేజమునిల్చె తెలుఁగు సోదరులందు,
తెలుగంటె యేమిటో—తెలుసుకొంటేచాలు:
తెలుఁగునాడును గొల్వరా! తమ్ముడా!.........